



మహాసభలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపి గఫూర్, వేదికపై ఎవి నాగేశ్వరరావు తదితరులు

నిర్లక్ష్యపు మంట....

- ప్రయాణికుల బస్సులో యథేచ్ఛగా లగేజీ తరలింపు - కావేరీ బస్సు లగేజీ బాక్సులో సెల్‌ఫోన్లతో పెరిగిన ప్రమాద తీవ్రం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వేమూరి కావేరీ ట్రావెల్స్ యాజమాన్యంతో పాటు డ్రైవర్ల నిర్లక్ష్యం కూడా బస్సు దుర్ఘటనలో ప్రమాద తీవ్రత పెరగడానికి కారణమని ఫోరెన్సిక్ బృందాలు గుర్తించాయి. ఈ ప్రమాదం ఘోర విషాదంగా మారడానికి రెండు కీలక అంశాలు కారణమయ్యాయని తేల్చారు. డోర్ల వద్ద ఉండే చిన్నపాటి హైడ్రాలిక్ సిలిండర్ పేలిపోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో డోర్లు తెరుచుకోలేదు. దీంతో ప్రయాణికులు బయటకు వచ్చే మార్గం మూసుకుపోయింది. దీని వల్ల బస్సులో ఉన్న ప్రయాణికులు బయటకు రాలేకపోయారు. ప్రయాణికుల బస్సులో లగేజీని తరలించేందుకు అనుమతి ఉండదు. కానీ ప్రైవేటు బస్సు యాజమాన్యం, సిబ్బంది డబ్బులకు కక్కుర్తి పడి లగేజీని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రమాద సమయంలో బస్సు లగేజీ క్యాబిన్‌లో 400కు పైగా సెల్‌ఫోన్లతో కూడిన పార్సిల్‌ను అక్రమంగా తరలిస్తున్నట్లు ఫోరెన్సిక్ బృందం గుర్తించింది. ప్రమాదం కారణంగా లేదా అధిక వేడికి ఈ ఫోన్ల లిథియం-అయాన్ బ్యాటరీలు పేలిపోవడం మంటలను, ప్రమాద తీవ్రతను గణనీయంగా పెంచిందని అధికారులు భావిస్తున్నారు. ఈ కారణం వల్లే నిమిషాల వ్యవధిలోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన వెంటనే డోర్లు తెరుచుకోకపోవడం, లగేజీ క్యాబిన్‌లోని ఫోన్ బ్యాటరీలు పేలిపోవడం ఈ రెండు కారణాలు కలిసి ప్రయాణికులకు తప్పించుకునే అవకాశాన్ని పూర్తిగా లేకుండా చేశాయి. ప్రధానంగా డ్రైవర్ బైక్‌ను ఢీకొట్టి ఆపకుండా పోవడం వల్ల మంటలు చెలరేగగా, పేలిన సిలిండర్, బ్యాటరీల పేలుళ్లు ఆ మంటలకు మరింత ఆజ్యం పోశాయి. ఈ ఘటన డ్రైవర్ నిర్లక్ష్యంతో పాటు ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థల భద్రతా ప్రమాణాల పాటించడంలో ఉన్న లోపాలను మరోసారి వేలెత్తి చూపుతోంది. ఇప్పటికైనా ఈ భయంకరమైన దుర్ఘటనతో భద్రతా నిబంధనలు, అత్యవసర మార్గాలు, లగేజీలో ప్రమాదకరమైన వస్తువుల తనిఖీ వంటి అంశాలపై ఆర్‌టిఎ అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



దగ్ధమైన బస్సు లగేజీ క్యాబిన్‌లో సెల్‌ఫోన్లు

పొగ పీల్చడం వల్లే మరణాలు

బస్సులో ఉన్నవాళ్లు పొగతో కూడిన గాలి పీల్చి ఊపిరాడక 3 నుంచి 5 నిముషాలలో స్పృహ కోల్పోయి ఉండవచ్చు లేక చనిపోయి ఉండవచ్చు. ఆ మంటల్లో ఖాళీ బూడిదయ్యారు. స్లీపర్ ఎయిర్ కండిషన్ బస్సులన్నీ ఎసి బయటికి పోనీ విధంగా క్లోజ్ అయ్యి ఉంటాయి. ఇలాంటి వాటిలో తక్కువ పొగ కూడా ఇబ్బంది పెట్టవచ్చు. ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఇలాంటి బస్సులో మార్పులు తేవాల్సిన అవసరం ఉంది. ఎక్కువ ఎగ్జిట్స్ కూడా పెట్టుకోవాలి. విమానాల్లో మాదిరిగా ప్రమాదం జరిగితే ప్రయాణికులు ఎలా తప్పించుకోవాలో ముందే అవగాహన కలిగించాలి. అప్పుడు ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు రక్షించుకోవడానికి అవకాశం ఉంటుంది.


- డాక్టర్ సాయి సుధీర్, జిజిహెచ్ ఫోరెన్సిక్ విభాగాధిపతి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మొంథా తుఫాన్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ప్రమత్తంగా ఉండి, సమన్వయంతో పని చేయాలన్నారు. శనివారం, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కర్నూలు జిల్లాలో 27న భారీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు, నదీతీర ప్రాంతాలను పరిశీలించి, ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా, తగిన నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వ్యవసాయ, పంచాయతీ రాజ్, రోడ్లు-భవనాలు, నీటిపారుదల, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఇని ఆదేశించారు. చెరువు గట్లు ఏమైనా బలహీనంగా ఉన్నాయా అని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ ట్యాంక్ లను అన్నిటిని పరిశీలించాలన్నారు.. సుంకేసుల రిజర్వాయరు పరిస్థితి ఔట్ ఫ్లో, ఇన్ ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ల బండ్స్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.. తక్షణ స్పందన చర్యలు తీసుకునే విధంగా సిద్ధంగా ఉండాలన్నారు.. జీరో క్యాజువలిటీ జీరో డ్యామేజ్ ఉండాలన్నారు. అన్ని శాఖల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్లు, భవనాలు, కల్వర్టు, బ్రిడ్జిలు ఏ స్థితిలో ఉన్నాయని పరిశీలించాలని కలెక్టర్ ఆర్అండ్‌బి ఎస్ఇని ఆదేశించారు. జెసిబి, కటింగ్ మెషిన్లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆర్అండ్‌బి ఎస్ఈ ని ఆదేశించారు...వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరినట్లయితే వెంటనే అద్దె భవనంలోకి వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వంతెనలు బాగా లేనట్లయితే వెంటనే మూసివేయాలని కలెక్టర్ ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాలలో ఉండే జనాభా ఆధారంగా షెల్టర్, భోజనం, స్నాక్స్, ఏర్పాటు చేసే విధంగా సిద్ధంగా ఉండాలన్నారు. పిల్లలకు పాలు, బ్రెడ్ ప్యాకెట్ కూడా ఉండాలన్నారు. అందుకు సంబంధించి రేషన్ షాపులను మ్యాపింగ్ చేసుకోవాలని కలెక్టర్ సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. షెల్టర్ హోమ్ లను కూడా గుర్తించి ప్రతి షెల్టర్‌లో ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య బృందాలను, అవసరమైన మందులు, చికిత్సా పరికరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. పంటల స్థితిని పర్యవేక్షించి రైతులకు తగిన సలహాలు అందించాలన్నారు. విద్యుత్ శాఖ కు సంబంధించి అన్ని సబ్ స్టేషన్ ల వద్ద జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.. సబ్ స్టేషన్ లు అన్నిటిని ఒకసారి వెరిఫై చేయాలన్నారు. బిఎస్ఎన్ఎల్, ఎయిర్టెల్, జియో నెట్వర్క్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి , ఇరిగేషన్ ఎస్ఇ బాలచంద్రారెడ్డి, హెచ్ ఎన్ఎస్ఎస్ ఎస్ఇ పాండురంగయ్య , డ్వామా పిడి వెంకటరమణయ్య , ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ మనోహర్, ఆర్ అండ్ బి ఎస్ఇ మహేశ్వర రెడ్డి, హౌసింగ్ పిడి చిరంజీవి, సిపిఒ భారతి, డిపిఒ భాస్కర్ , తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

ఉద్యమాలతోనే కార్మికుల బతుకుల్లో మార్పు

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ.గఫూర్
- జిల్లా 13వ మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బలమైన ఉద్యమాలు చేయడంతోనే కార్మికుల బతుకులు మారుతాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్ సూచించారు. శనివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు కర్నూలు జిల్లా 13వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సిఐటియు జెండాను మెడికల్ రేప్స్ యూనియన్ నాయకులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు సిఐటియు జెండా ఔన్నత్యాన్ని గురించి గేయాలను ఆలపించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎంఏ.గఫూర్ , జిల్లా నాయకులు నివాళి అర్పించారు. సిఐటియుకు విశేష సేవలు అందించి తమ తుది శ్వాసవరకు పాటుపడి అమరులైన నాయకులు రాజగోపాల్, బి.మహానందరెడ్డి, జెఎన్.శేషయ్యల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మహాసభకు పిఎస్.రాధాకృష్ణ, పి.నిర్మల, ఈరన్నలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముఖ్యఅతిథి ఎంఏ.గఫూర్ మాట్లాడుతూ రాజగోపాల్, మహానంద రెడ్డి, జెఎన్.శేషయ్య, రాజేశ్వర్‌రెడ్డి లు తమ ప్రాంతాల్లో సిఐటియు కోసం చేసిన కృషిని, విశాల ప్రజా ఉద్యమాల గురించి వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం వ్యతిరేక ప్రభుత్వమని, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందని అన్నారు. కార్మిక వర్గాన్ని మతపరంగా చీలుస్తూ హిందువుల ఐక్యతపేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. అందుకే మతాలకతీతంగా కార్మిక వర్గం ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. కుల మతాలకతీతంగా కార్మిక వర్గం ఐక్యం చేసి కొత్త కార్మిక సమాజం మార్పుకోసం పాటుపడాలన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను మార్చేస్తూ నాలుగు కోడ్లుగా చేసి కార్మికుల హక్కులను లాగేసి చట్టాల కోరలు పీకేసి కార్మిక హక్కులను నిర్వీర్యం చేసిందన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో జాతీయ ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. రాష్ట్ర పరిస్థితి చూస్తే నారా లోకేష్ విద్యాశాఖ మంత్రి అయినప్పటికీ అన్ని శాఖల మంత్రిగా వ్యవహరిస్తూ ఆస్ట్రేలియాలో పెట్టుబడిదారులను ఆహ్వానిస్తూ ఒక బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నారని అన్నారు. జగన్, చంద్రబాబు మోడీకి ఊడిగం చేసే నాయకులుగా అభివర్ణించారు. మతం పేరుతో కల్లోలాలు సృష్టిస్తున్నారన్నారు. 50 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు పెంచకుండా గత 20 సంవత్సరాలుగా పాలన చేస్తున్నారన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని చెప్పారు. అందుకే కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలను ఓడించి ప్రజల కార్మికుల శ్రేయస్సు కోరే ప్రభుత్వాలను గెలిపించాలన్నారు. కార్మికులు ఐక్యంగా ప్రజా ఉద్యమాలు చేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు గత మూడు సంవత్సరాల్లో చేసిన కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. మహాసభలలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ బి. రామాంజనేయులు, నారాయణస్వామి, ప్రభాకర్, సిహెచ్‌సాయి బాబా, విజయ రామాంజనేయులు, ఉమాదేవి నాయకులు రఘు బాబు, దివాకర్ , నరసింహులు, అబ్దుల్‌దేశాయ్, పిఎస్.రాధాకృష్ణ,గోపాల్, రాముడు, మధు, హుస్సేనయ్య, నగేష్ వివిధ మండలాల నుండి వివిధ రంగాలకు చెందిన 220 మంది ప్రతినిధులు హాజరయ్యారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్



అమరులకు నివాళులర్పిస్తున్న ఎంపి.గఫూర్, ఎవి.నాగేశ్వరరావు తదితరులు

వైద్యులకు నిరంతర ఆధునికీకరణ అవసరం

-కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్‌చిట్టి నరసమ్మ
-అనస్థీషియా విభాగం పోకస్ ప్లస్ 2025 హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ప్రారంభం

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

వైద్యులు ఆధునిక ఆవిష్కరణలను అందిపుచ్చుకొని తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.ట్టి నరసమ్మ సూచించారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో మోర్చాన్ స్కిల్‌ల్యాబ్‌లో అనస్థీషియాలజి, కర్నూలు సొసైటీ ఆఫ్ అనస్థీషియా విభాగం నిర్వహిస్తున్న రెండు రోజుల హాండ్స్‌అన్ ట్రైనింగ్ పోకస్ ప్లస్ 2025ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి వైద్యుడు నిత్య విద్యార్థి అని అన్నారు. వైద్యరంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం ద్వారా మరింత మెరుగుగా కచ్చితత్వంతో రోగులకు వైద్య సేవలు అందించవచ్చని సూచించారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యరంగలో అనస్థీషియా విభాగపు ప్రాధాన్యత వెలకట్టలేనిదని, ప్రతి సర్జరీ అనస్థీషియా వైద్యుల సహకారం తోనే జరుగుతుందని అన్నారు. అల్ట్రా సౌండ్ సహకారంతో ఖచ్చితమైన ప్రదేశంలో రోగికి మత్తు అందించడం ద్వారా సురక్షితమైన సర్జరీకి మార్గం ఏర్పడుతుందని తెలిపారు. ఈ రెండు రోజుల హాండ్స్ ఆన్ శిక్షణలో లంగ్ అండ్ ఎయిర్‌వే యుఎస్‌జి , ఫ్లూయిడ్ రెస్పాన్సివ్నెస్,అప్పర్ అండ్ లోయర్ లింబ్స్, ట్రన్కాల్ బ్లాక్స్, టిటిఇ మొదలగు అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన అనస్థీషియా వైదులకి నిపుణులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా విభాగపు అధిపతి ఛైర్మెన్ డాక్టర్ విశాల, వైస్ చైర్మన్ డాక్టర్ రామ్ శివ నాయక్, సెక్రటరీ జయదేవ్ రాథోడ్, ఎపిఎంసి అబ్జర్వర్ ఫార్మకాలజి విభాగాధిపతి డాక్టర్ రాజేష్, కర్నూలు సొసైటీ ఆఫ్ అనస్థీషియా ప్రెసిడెంట్ డాక్టర్ సుదీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోగులతో నిండిన స్థానిక ఆస్పత్రి

ప్రభలుతున్న విషజ్వరాలు

-పారిశుధ్యంపై అధికారుల నిర్లక్ష్యం - పెరుగుతున్న డెంగీ కేసులు

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండలం బోయినపల్లి, అల్లుగుండు, వెల్దుర్తి గ్రామాలలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వెల్దుర్తి లోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత వారం రోజులలో ఆరు డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యులు తెలిపారు. టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో పలువురు చికిత్స పొందుతున్నారు. గ్రామలలో చెత్తకుప్పలు నీటి నిల్వలు ఎక్కువగా ఉండడంతో డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు, వైరల్ ఫీవర్లు గ్రామలలో విజృంభిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామలలో మురుగు కాలువలు చెత్తకుప్పలు తొలగించకుండా అలాగే నిల్వ ఉంచుతున్నారు. బ్లీచింగ్ చేయకపోవడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలు తెలుపుతున్నారు. మండల అధికారులు ప్రత్యేకమైన చర్యలు తీసుకొని గ్రామలలోని చెత్తను తొలగించి బ్లీచింగ్ చేయాలని కోరుతున్నారు.

ర్యాంకింగ్‌లో వర్సిటీ ఉత్తమ స్థానంలో ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉన్నత విద్యాసంస్థల ర్యాంకింగులో రాయలసీమ యూనివర్సిటీ ఉత్తమ స్థానం సంపాదించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఆచార్య ఎస్.విజయభాస్కర్‌రావు సూచించారు. యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో వర్సిటీ అధికారులు అధ్యాపకులతో ఆయన సమావేశమయ్యారు. పిజి.సెంటర్ విద్యార్థిగా రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని విసి ఆచార్యవి.వెంకట బసవరావు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ప్రతిఒక్కరూ తమతమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాల్సిన అవసరముందని విసి సూచించారు. వర్సిటీలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, పరిశోధనా కార్యక్రమాలను ఆచార్య బసవరావు వివరించారు. పరిమితులు ఉన్నప్పటికీ వర్సిటీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ తమవంతుగా కృషిచేయాల్సిన అవసరముందని ఆచార్య విజయభాస్కర్‌రావు సూచించారు. ఆచార్యులు, అధ్యాపకులు పరిశోధనలమీద మరింతగా దృష్టిసారించాల్సిన అవసరముందని హితవుపలికారు. యూనివర్సిటీలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తుకు సరైన మార్గదర్శనం చేసేవిధంగా సిలబస్‌కు రూపకల్పన చేయాలన్నారు. నైతిక విలువలు పెంపొందేవిధంగా విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేస్తూ మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించాలన్నారు. రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలతో సమన్వయం చేసుకుంటూ వివిధ పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టాలని అన్నారు. తద్వారా వర్సిటీకి నిధుల కొరతకూడా తీరుతుందన్నారు. తన యూనివర్సిటీ అన్నభావనతో ఆచార్య విజయభాస్కరరావు రాయలసీమ యూనివర్సిటీకి విచ్చేయడం సంతోషకరమని వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టికె.నాయక్ హర్షం వ్యక్తంచేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయకుమార్ నాయుడు కార్యక్రమానికి స్వాగతం పలికి వర్సిటీ పరిస్థితులను వైస్ ఛైర్మన్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సివి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఎన్. నరసింహులుతోపాటు వివిధ విభాగాల ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆచార్య ఎస్.విజయభాస్కర్‌రావును అభినందిస్తున్న ఆర్‌యు విసి

పత్తి రైతుకు వర్షాల దెబ్బ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. నెల రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తిపంటపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. పత్తి పైరు ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఈ సమయంలో వరుసగా వర్షాలు కురుస్తుండడంతో పూత, పిందె రాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు చేలలో వాన నీరు నిలుస్తుండడంతో మొక్కలు ఎర్రబారి తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో దిగుబడి తగ్గడమే కాకుండా కనీసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు అంటున్నారు. మూడేళ్లనుంచి పత్తి పంట గిట్టుబాటు కాకపోవడంతో రైతులు తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ఎకరానికి రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టి రైతులు పత్తి సాగు చేశారు. పత్తి కాయ, పూత వచ్చిన సమయంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పూత, కాయ రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాల వల్ల వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో చాలా చోట్ల పత్తి మొక్కలు ఎర్రబారి కాయ, పూత రాలిపోతున్నాయి. ఎరువులు వేసి కలుపు తీసేందుకు కూడా తెరిపినివ్వక పోవడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా మంగళవారం, బుధవారాలలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. రాబోయే రెండు, మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

సజీవ దహనం : హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు ఎసి స్లీపర్ బస్సు కర్నూలు జిల్లాలోని కల్లూరు మండలం చిన్న టేకూరు దాటిన తరువాత కాలి బూడిదైంది. బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. రోడ్డుకు, ద్విచక్రవాహనానికి మధ్య రాపిడి ఏర్పడటంతో నిప్పు రవ్వలు వచ్చి తొలుత ద్విచక్రవాహన పెట్రోల్ ట్యాంకుకు నిప్పంటుకుంది. తరువాత ఆ మంటలు బస్సుకు వ్యాపించాయి. బస్సు ముందు భాగంలో పొగ, అగ్ని రావడం గమనించిన కొందరు ప్రయాణికులు అప్రమత్తమై బస్సు అద్దాలను పగలగొట్టుకుని బయటకు దూకేశారు. అంతలోనే మంటలు ఎక్కువ కావడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సులోనే మిగిలిన 19 మంది సజీవ దహనం అయ్యారు.

నిండిపోయిన పొగ : దీపావళి రోజు జిల్లాకు పొగతో నిండిపోయింది. కాలుష్య వాయువులు సోమవారం తారా స్థాయికి చేరాయి. గాలి నాణ్యత భారీగా పడిపోయింది. గాలి నాణ్యతా సూచి (ఎక్యూఐ) 50 లోపు ఉండాల్సి ఉండగా దీపావళి రోజు సాయంత్రం 7 గంటలకు 277కు, 8 గంటలకు 321కు పెరిగింది. ఎక్యూఐ 300 దాటడం ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. గాలిలోని 2.5 ధూళి కణాలు (పిఎం 2.5) క్యూబిక్ మీటరుకు 30 మైక్రోగ్రాముల లోపు ఉండాల్సి ఉండగా సోమవారం సాయంత్రం 7 గంటలకు 135 మైక్రోగ్రాములుగా, 8 గంటలకు 152 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. పిఎం 2.5 కణాలు 121 మైక్రోగ్రాములు దాటినప్పుడు ఆ గాలిని పీల్చడం వల్ల శ్వాసకోశవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. 24 గంటల్లో 19 గంటలు డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాల కంటే అధిక మోతాదులో నమోదైంది.

పేలిన టపాసుల ధరలు : దీపావళికి కొనుగోలు చేసే టపాసుల ధరలు ఈ ఏడాది మండిపోయాయి. గతేడాది కంటే 20 నుంచి 25 శాతం వరకూ ధరలు పెరగడంతో సామాన్యులు టపాసులను కొనేందుకు ఆసక్తి లేదు. మరికొంత మంది తక్కువ మొత్తంలో కొనుగోలుతో సరిపెట్టుకుంటున్నారు. ఇద్దరు చిన్నారుల కోసం పది రకాల టపాసులు కొనాలన్నా కనీసం రూ.2వేల వరకూ ఖర్చు చేయాల్సి వచ్చింది.





టోల్‌ప్లాజా వద్ద రాత్రి పూట డ్రైవర్‌కు మొహం కడిగించి టీ తాపుతున్న పోలీసులు

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

-జనవరి నుంచి 7,248 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
-14,182 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు-డిఐజి, ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత లక్ష్యంగా ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ రోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు. గత (2025 జనవరి నుండి అక్టోబర్ 24 వరకు) నెలలో 7,248 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 14,182 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమదాలు ఎక్కువగా జరుగుతున్నాయని రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ , ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు ముమ్మరం చేశారన్నారు. 2025 సెప్టెంబర్ 29 వ తేది నుండి అక్టోబర్ 24 వరకు 85 స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమాలను నిర్వహించారని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

బీటీ రోడ్డును త్వరగా పూర్తి చేయాలి


పలుకుదొడ్డి - సంగాల రోడ్డును పరిశీలించిన డిఇ

ప్రజాశక్తి-సి బెళగల్

బీటీ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని డిఇ కర్రెన్న సూచించారు. పలుకుదొడ్డి -సంగాల గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను డిఇ కర్రెన్న శనివారం పరిశీలించారు. సహాయక ఇంజినీర్ పాపారాయుడు సమక్షంలో డస్టు పరచిన తీరును , మట్టి చదును పనులను పరిశీలించి నాణ్యత నియమాలు తప్పనిసరిగా పాటించాలని గుత్తేదారుకు సూచించారు. అలాగే బిటీ రోడ్డు పనులను కూడా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు.



బీటీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డిఇ కర్రెన్న


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

28న పత్తి రైతుల జిల్లా సదస్సు

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఈనెల 28న ఆదోనిలో నిర్వహించే పత్తి రైతుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, జిల్లా కమిటీ సభ్యులు బాష, వ్యకాస మండల నాయకులు శ్రీనివాసులు, సిఐటియు నాయకులు జలంధర్ కోరారు. శనివారం వారు మాట్లాడారు. జిల్లాలో పత్తి రైతులు కనీస మద్దతు ధర అమలు కాకపోవడంతో క్వింటాకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు నష్టపోతున్నారని తెలిపారు. మరోవైపు అధిక వర్షాల వల్ల దిగుబడి తగ్గిందని చెప్పారు. పత్తి రైతుల రక్షణకు చర్యలు తీసుకోవాలని, డాక్టర్ స్వామినాథన్ సిఫారసు మేరకు కనీసం మద్దతు ధర క్వింటాకు రూ.10 వేలు ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

'కూటమి'లో నాణ్యమైన మద్యం : టిడిపి

ప్రజాశక్తి - కౌతాళం


యాప్ స్కానర్ గురించి వివరిస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం లభిస్తోందని, కల్తీ మద్యం అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు, టిడిపి మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు కోరారు. శనివారం స్థానిక కెఇ వైన్స్ షాప్ ముందు మందు కొనుగోలు దారులకు 'ఏపి ఎక్సైజ్ శాఖ సురక్ష యాప్' గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ దుష్ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. తుంగభద్ర ప్రాజెక్ట్ ఛైర్మన్ టిప్పు సుల్తాన్, కౌతాళం, బదినేహాల్ సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు, మారెప్ప, సీనియర్ నాయకులు అడివప్ప గౌడ్, చౌదరి బసవరాజు, రామలింగ, నాగేందర్ రెడ్డి, జనసేన మండల నాయకులు రామాంజినేయులు, శంకర్, బసవరాజు, నరసింహ, కర్రె బసవన్న గౌడ్, మాణిక్ బాషా, నాగిరెడ్డి, మహాదేవ, మహానంది, శివ, లక్ష్మణ్, గిరి, ముకన్న, గిడ్డయ్య పాల్గొన్నారు.

బాధితునికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


నాగప్పను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందవరం

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగలదిన్నె గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు ఖ్యాతం నాగప్పను మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరామర్శించారు. శనివారం ఆయన నాగలదిన్నె గ్రామంలోని నాగప్ప నివాసానికి చేరుకొని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కొద్దిరోజుల క్రితం కర్నూలు ఆస్పత్రికి, ఇప్పుడు తమ గ్రామాన్ని మాజీ ఎమ్మెల్యే సందర్శించి పరామర్శించినందుకు నాగప్ప కుటుంబం సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ప్రతాప్ రాజేష్ శెట్టి నివాసానికి చేరుకొని సమావేశం నిర్వహించారు. గ్రామంలో వైసిపి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పివి.రాజేష్ కుమార్ శెట్టి, గడ్డం నారాయణరెడ్డి, కె.నాగప్ప, ప్రభాకర్, శరత్, తెలుగు రంగరెడ్డి, కె.రాముడు, కాకి ఆదెన్న, నాగరాజు, వడ్డే వీరేష్, హుస్సేని గౌడ్, కొట్టేకల్ చందు పాల్గొన్నారు.

పరిశ్రమలు, వాణిజ్యంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - మంత్రాలయం

పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలపై ఎన్ఎస్ఒఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక శ్రీరాఘవేంద్ర డిగ్రీ కళాశాల విద్యార్థినులకు, మండలంలోని చిలకలడోన గ్రామ సమీపంలో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, వాణిజ్య కార్యకలాపాల వల్ల ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని లెక్చరర్లు స్వప్న, లక్ష్మి వివరించారు.

ఎస్సీ కాలనీల్లో రోడ్ల సమస్య

- పట్టించుకోని ప్రభుత్వం : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని పాత, కొత్త ఎస్సీ కాలనీల్లో రోడ్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, నాయకులు సురేష్, అబ్దుల్లా, బి.రాజు, సుభాన్ విమర్శించారు. శనివారం సిపిఎం నాయకులు కటికపేట, చంద్రయ్య కొట్టాల, కబరస్థాన్ కొట్టాలు, పాత హరిజనవాడ, కొత్త హరిజనవాడలో పాదయాత్రలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ... పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. చంద్రయ్య కొట్టాలలో వీధి రోడ్ల నిర్మాణంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లిం బరియల్ స్కూల్ పైకప్పు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కొట్టాలలో నిరుపేద ముస్లిం, మైనార్టీలు నివసిస్తున్నారని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. మలేరియా, డెంగీ, జ్వరాలు ప్రబలినా వైద్యానికి డబ్బుల్లేక చాలామంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చాంద్ బాషా, గూడుసాబ్, నజీర్, ఖాజావలీ, బాష, మెకానిక్ రాజు, నామాల రాముడు పాల్గొన్నారు.



వాడల్లో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు


గ్రామంలో నిలిచిన మురుగు నీరు

డ్రెయినేజీ, సిసి రోడ్లు లేక అవస్థలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని ఐరన్‌బండ బి సెంటర్ గ్రామంలో డ్రెయినేజీ కాలువలు, సిసి రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని చర్చి సమీపంలో మట్టి రహదారులపై మురుగునీటి కాలువలు, సిసి రోడ్లు లేకపోవడంతో ఆ ప్రాంతవాసుల ఇళ్లలోని నీరు, వర్షపు నీరు సైతం రహదారులపై నిల్వ ఉంటోంది. నిల్వ ఉన్న నీరు దుర్వాసన రావడం, దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులకు విన్నవించినప్పటికీ సమస్యను పరిష్కరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల పరిషత్ అధికారులు స్పందించి డ్రెయినేజీ, సిసి రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు బంగారు పథకాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణానికి చెందిన జూనియర్ కళాశాల ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి బోయ నరసింహులు ఇటీవల ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో 800, 1500, 4X400 రిలే పరుగు పందెంలో మూడు బంగారు పతకాలను సాధించారు. శనివారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. హాలహర్వి గ్రామానికి చెందిన ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి బోయ నరసింహులును ప్రిన్సిపల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ లుక్మాన్ అభినందించారు. వారు మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పరుగు పోటీల్లో ప్రతిభను కనబరచి మూడు బంగారు పతకాలు సాధించారని, నవంబర్‌లో హర్యాన రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారుడు నరసింహులు మాట్లాడుతూ... తన వెన్నంటి ప్రోత్సహిస్తున్న కోచ్ ఎర్రకోట మల్లికార్జున కఠోర శ్రమ, ఆటలోని మెళకువలను నేర్పించి తనను ఇంతవాన్ని చేశారన్నారు. అధ్యాపకులు రుక్మాన్, రంగస్వామి, ఎల్లప్ప, రాజశేఖర్, లక్ష్మన్న, రంగనాయక్, తల్లిదండ్రులు రాగయ్య, జయమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హత్తి బెళగల్ విద్యార్థులు

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు హత్తి బెళగల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రామసుబ్బయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ఈనెల 12న కర్నూలులో జరిగిన సెపక్ తక్రా ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో బాలురు ఎస్.సమీర్ బాష, పి.సమీర్ బాష, బాలికల విభాగంలో కె.ఆకాంక్ష అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. బాలురు అండర్-17 విభాగంలో కె.రియాజ్ తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రామసుబ్బయ్య, ఉపాధ్యాయులు ఖాసీం, వలీ, నరహరి, వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్ర, పీడీ చిన్నబాబు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

31 వరకే పంట నమోదుకు అవకాశం : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడానికి ఈనెల 31 వరకు తుది గడువు ఉందని ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ శనివారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసుకున్న ప్రతి రైతూ ఈ-క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఎఒ వరమాదేవి పాల్గొన్నారు.

శిథిలావస్థలో గృహాలు

- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా

ప్రజాశక్తి - కోసిగి

గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరాయి. లక్షలాది రూపాలయ ప్రజాధనం వృథా అయింది. 2009లో వచ్చిన వరదల్లో సర్వం కోల్పోయిన వారికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని సాతనూరు గ్రామంలో బాధితులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణాలు చేపట్టింది. దాదాపు 600 ఇళ్లను మంజూరు చేసింది. ఒక్క ఇల్లు కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేదని గ్రామస్తులు విమర్శించారు. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు. ఇప్పటికి 16 ఏళ్లు కావస్తున్నా ప్రస్తుతం ఉన్న అధికారులు, నాయకులు ఆ కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. గతంలో నిర్మించిన ఇల్లు శిథిలావస్థకు చేరి, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఆ ఇళ్ల చుట్టూ కంప చెట్లు నిండి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. కొన్ని ఇళ్లను పునాదులకే పరిమితం చేశారు. మరికొన్ని ఇళ్లను అరకొరగా నిర్మించి అలాగే వదిలేశారు. వరద కాలనీలో కనీసం రోడ్లు సైతం వేయలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి గతంలో ఇచ్చిన లబ్ధిదారులను గుర్తించి, అసంపూర్తిగా ఉన్న ఇళ్లను నిర్మించి, కాలనీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించి నూతన కాలనీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముళ్లపొదల మధ్య ఉన్న గృహాలు


మీనాక్షి జువెల్లర్ షాపులో 4 కిలోల వెండి చోరీ



జువెల్లర్ షాపు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని తుంగభద్ర గ్రామంలోని మీనాక్షి జువెల్లర్ షాపులో 4 కిలోల వెండి ఆభరణాలు దోపిడికి గురైనట్లు మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కంసాలి రవి తుంగభద్ర గ్రామంలో మీనాక్షి జువెల్లర్ పేరుతో షాపును నిర్వహిస్తూ వెండి బంగారు ఆభరణాల వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో శ్రీమీనాక్షి జువెల్లర్ షాపులో గుర్తుతెలియని దొంగలు షాపు షెట్టర్ పగలగొట్టి దుకాణం లాకర్‌లో ఉన్న సుమారు రూ.6 లక్షల విలువ చేసే 4 కిలోల వెండి ఆభరణాలను దొంగిలించారని తెలిపారు. యజమాని రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

త్వరలో తేదీ ప్రకటన

ప్రజాశక్తి - ఆదోని రూరల్

సాంకేతిక సమస్య కారణంగా సిసిఐ పత్తి కొనుగోలు తేదీని త్వరలో ప్రకటిస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు శనివారం తెలిపారు. రైతులు గమనించాలని కోరారు.

వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో షెడ్ల తొలగింపు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో కూరగాయల వ్యాపారం చేసుకునే షెడ్లు, ఇతర దుకాణ షెడ్లను మున్సిపల్ అధికారులు తొలగించారు. శనివారం హై కోర్టు ఆదేశాల మేరకు వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టిపిఒ రాజేష్ పాల్గొన్నారు.

షెడ్ల తొలగింపు అక్రమం : వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక


షెడ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో ఏర్పాటు చేసిన వ్యాపార షెడ్లను మున్సిపల్ అధికారులు రాత్రి వేళ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించడం అక్రమమని వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక విమర్శించారు. కోర్టు ఉత్తర్వులున్నాయని చెబుతున్నప్పటికీ, ఉత్తర్వుల ప్రకారం వ్యాపారులకు ముందుగా నోటీసులు ఇవ్వాలని, వారికి సరైన సమయం ఇవ్వాలని, వారి సమక్షంలోనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాత్రికి రాత్రి షెడ్లను తొలగించడం వల్ల పేద, మధ్యతరగతి చిరు వ్యాపారులు ఆర్థిక నష్టానికి గురయ్యారని చెప్పారు. అనేక కుటుంబాలు రోడ్డున పడ్డ పరిస్థితి ఉందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్‌లో సంప్రదించి, పేద వ్యాపారులకు మున్సిపల్ పరిధిలోనే మరో అనుకూలమైన స్థలమివ్వాలని తెలిపారు. ఆర్థికంగా నష్టపోయిన వారికి తగిన పరిహారం ఇవ్వాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, వైసిపి నియోజకవర్గ స్థాయి నాయకులు కెఆర్.మురహరి రెడ్డి, జిల్లా చేనేత అధ్యక్షులు ఎంకె.శివప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి కదిరికోట సునీల్, నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షులు మీసాల బండ శివ నిలకంఠ, బాబులాల్, బలరాం యాదవ్, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ యుకె.రాజశేఖర్, వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, కోటకొండ నరసింహులు, బోయ పామయ్య, బి.బసిరెడ్డి, నరసింహులు, ఉరుకుందు గౌడ్, ఎమ్‌డి.షరీఫ్, కుమార్, జశ్వంత్ పాల్గొన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న వైసిపి ఇన్చార్జ్ బుట్టా రేణుక


నివాళులర్పిస్తున్న తిరుపతయ్య నాయుడు

గుండెపోటుతో టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని అలువాల గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు కురువ వెంకటేశ్వర్లు(61) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కురువ మల్లయ్య, హెచ్.కైరవాడి సొసైటీ ఛైర్మన్ తిమ్మారెడ్డి, అలువాల సర్పంచి బాషాతో కలిసి మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, అధైర్యపడవద్దు అని కుటుంబ సభ్యులకు సూచించారు. టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజేష్ నాయుడు, నాయకులు మల్లేష్ నాయుడు, అలువాల డ్రైవర్ నూర్, లడ్డు ఖాసీంసాబ్, టిఎన్ఎస్ఎఫ్ రమేష్ నాయుడు, ఐటిడిపి రాంపురం రఫీక్, రవి గోపాల్, నజీర్, హనుమంతు, చాంద్‌బాషా, రాజు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు : సిఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

పోలీసు నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని సిఐ రామాంజులు హెచ్చరించారు. శనివారం స్థానిక భారత్ పెట్రోలియం బంక్ వద్ద నిబంధనలు అతిక్రమించి రాంగ్ రూట్‌లో వచ్చిన ద్విచక్ర వాహన దారులకు జరిమానాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వాహనాల్లో మంత్రాలయం వస్తున్న భక్తులు వాహనాలను ఇష్టారాజ్యంగా రోడ్డుపై నిలపరాదని సూచించారు. శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో వాహనదారుల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ట్రాఫిక్ నియంత్రణ కష్టసాధ్యంగా మారిందని, భక్తులు సహకరించాలని కోరారు. లేకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గ పరిధిలో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శనివారం పట్టణంలోని 7వ వార్డులో కునిముల్ల ఏరియాలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ సిమెంట్ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా మున్సిపాలిటీలో జమ చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.80 కోట్లు ఆదోని మునిసిపాలిటీకి విడుదలయ్యాయని, దీని ద్వారా పట్టణంలోని సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఏర్పడిందని చెప్పారు. ఈ గ్రాంట్‌ను రెండు రకాలుగా విభజించి టైడ్ గ్రాంట్ కింద రూ.3.48 కోట్లను తాగునీటి వసతి (ఇంటింటి కుళాయి) కోసం ఖర్చు చేస్తామని తెలిపారు. మిగతా రూ.2.32 కోట్లను రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ కోసం ఖర్చు చేస్తామని చెప్పారు. రాబోయే మూడు నెలల్లో ఆదోనిలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతాయని వివరించారు. మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, వైస్ ఛైర్మన్లు గౌస్, నరసింహులు, మున్సిపల్ ఇంజినీర్ సత్య నారాయణ, కౌన్సిలర్లు ఉస్మాన్ పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

మద్దతు ధరతో రైతులకు భరోసా

- సిసిఐ కేంద్రాలు సిద్ధం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మద్దతు ధరతో రైతులకు భరోసా లభిస్తుందని, త్వరలో సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిసిఐ కమర్షియల్ ఆఫీసర్ శ్రీనివాస్, మార్కెట్ యార్డు సెక్రటరీ గోవిందు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ... సిసిఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి అమ్మకం జరిగితే రైతులకు పారదర్శకమైన ధర, నేరుగా బ్యాంకు ఖాతాల్లో చెల్లింపులు జరుగుతుందని తెలిపారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా ముందుగా నమోదు చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పారు. ఇప్పటికే ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న వారు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం ప్రతులతో సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

మాస్టర్ ఓరియంటేషన్‌లో ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు నగరంలోని నారాయణ పాఠశాలలో జరిగిన మాస్టర్ ఒరింటేషన్ కాంటెస్ట్‌లో ఆదోని విద్యార్థులు ప్రతిభ చాటారని ఆదోని నారాయణ స్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మిరెడ్డి తెలిపారు. శనివారం స్కూల్‌లో ప్రతిభ పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా తమ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు ఓరియంటేషన్ కాంటెస్ట్ నిర్వహించారని తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి హాజరై గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారని చెప్పారు. ఆదోని నారాయణ పాఠశాలకు చెందిన 1వ తరగతి విద్యార్థి నందితకు మొదటి బహుమతి, 3వ తరగతి విద్యార్థి జాస్మిత, సిద్ధార్థ్ అభిరామ్‌లు తృతీయ బహుమతి సాధించారని తెలిపారు. కర్నూలు ఎజిఎం రమేష్ కుమార్ మాట్లాడుతూ... గెలుపోటములు సహజమని, ఓటమి అనేది గెలుపునకు తొలిమెట్టు అని, గెలుపొందిన విద్యార్థులను అభినందిచారు.

వధూవరులను ఆశీర్వంచిన నాయకులు


ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి పిఎ వంశీ సోదరి పెళ్లి వేడుకలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డితో పాటు ఇతర టిడిపి ముఖ్య నేతలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. శనివారం ఆదోనిలోని కింగ్స్ ప్యాలస్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న వారు వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారికి ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. టిడిపి నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, కోసిగి ముత్తురెడ్డి, కౌతాళం మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

సురేష్ నాయుడు నాయకత్వంలో ముందుకు : టిడిపి

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి మండల అధ్యక్షులు సురేష్ నాయుడు నాయకత్వంలో ప్రజలకు సేవలందించేందుకు ముందుకెళ్తామని టిడిపి నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన టిడిపి మండల అధ్యక్షులు సురేష్ నాయుడును సన్మానించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలని, పార్టీలకు అతీతంగా సేవలు అందించి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సురేష్ నాయుడు కోరారు. టిడిపి కుంభాలనూర్ నాయకులు మహదేవ, స్వామి, వీరేష్, బదినేహాల్ నాయకులు వీరేష్, షేక్షావలీ, ఉరుకుంద నాయకులు మహదేవ నాయుడు పాల్గొన్నారు.



సురేష్ నాయుడును సన్మానిస్తున్న నాయకులు

సమస్యలపై దృష్టి సారించాలి

- ఎమ్మెల్యేకు, టిడిపి ఇన్‌ఛార్జీకి సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం, పెద్దకడబూరు మండలాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని సిపిఎం నాయకులు తిక్కన్న, జయరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని, మాధవరం గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు, సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెద్దకడబూరు, మంత్రాలయం మండలాలకు సాగు, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ పనులను చేపట్టాలని, పులికనుమ ప్రాజెక్టు ద్వారా పెద్దకడబూరు మండలానికి సాగు, తాగునీరు అందించాలని కోరారు. గురు రాఘవేంద్ర లిఫ్ట్ ద్వారా మాధవరం లిఫ్ట్‌కు, సూగూరు లిఫ్ట్‌కు, బసలదొడ్డి లిఫ్ట్ ద్వారా సాగు, తాగునీరు అందించాలని తెలిపారు. మండలంలోని చిలకలడోన, కల్లుదేవకుంట గ్రామానికి తాగునీటి సరఫరాకు పాత పైపులైన్లు తొలగించి కొత్త పైపులను వేయాలని కోరారు. మంత్రాలయంలో ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేసి మండల ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ నాయకులు జి.అంజి పాల్గొన్నారు. ఈనెల 27న పెద్దకడబూరులో సిపిఎం ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'ఆదోని సిఐపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - ఆదోని


మాట్లాడుతున్న నాయకులు

కేసుల పని మీద స్టేషన్‌కు వెళ్లే న్యాయవాదులతో దురుసుగా ప్రవర్తిస్తున్న ఆదోని టూ టౌన్ సిఐ రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే నిరవధిక సమ్మె చేస్తామని న్యాయవాదులు హెచ్చరించారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆదోని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరాములు, కార్యదర్శి జీవన్ సింగ్ మాట్లాడారు. ఆదోనిలో రానురాను సిఐల ఆగడాలు మితిమిరి పోతున్నాయని విమర్శించారు. గురువారం సీనియర్ న్యాయవాది కెజి.వెంకటేష్‌తో ప్రవర్తించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్లలో సివిల్ పంచాయితీలతో బిజీగా ఉంటూ ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తించచడం సరికాదన్నారు. జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పిజె.సుధాను, సివిల్ జడ్జి యగ్నానారాయణ, ఇతర న్యాయమూర్తులను కలిసి సోమవారం ఎస్పీని, కలెక్టర్ కలిసి వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వెంకటేష్, సీనియర్ న్యాయవాదులు దేశాయి, మన్సూర్ అహ్మద్, వైఆర్.మల్లికార్జున, విరుపాక్షి రెడ్డి, తబరేజ్, హాజీ రజా అహ్మద్, కల్యాణ్ రెడ్డి, గిరిధర్, బషీర్, జూనియర్ న్యాయవాదులు హుస్సేన్ సాని, సాయికుమార్, మధు, ఖలందర్, ఆసిఫ్, మస్తాన్ పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవంపై వ్యాస రచన పోటీలు

- ఎంఇఒలు మొయినుద్దీన్, రాఘున్న

ప్రజాశక్తి - మంత్రాలయం

నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మండలస్థాయిలో వ్యాసరచన, క్విజ్, వక్తృత్వపు పోటీలు నిర్వహించినట్లు ఎంఇఒలు మొయినుద్దీన్, రాఘున్న తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ... మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వపు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని చెప్పారు. పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, సూగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లచ్చప్ప, ఎపి మోడల్ స్కూల్ నుంచి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీమఠానికి బియ్యం విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం


బియ్యం అందిస్తున్న దాతలు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠానికి భక్తులు బియ్యం బస్తాలను విరాళంగా అందజేశారు. శనివారం మహారాష్ట్ర రాజధాని ముంబయికి చెందిన భక్తుడు అశోక్ భట్ సతీసమేతంగా మంత్రాలయం వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులను కలిసి 1,750 కిలోల బియ్యం బస్తాలు, వెండి వస్తువులను విరాళంగా ఇచ్చారు. పీఠాధిపతులు దాతకు శేషవస్త్రం అందజేసి ఆశీర్వదించారు.